# 4. మన పండుగలు

బొమ్మను చూడండి - ఆలోచించి మాట్లాడండి.



ప్రశ్నలకు జవాబులు చెప్పండి :

* బొమ్మను చూడండి. ఈ బొమ్మ ఏ పండుగను తెలుపుతుంది? ఏం చేస్తున్నారో చెప్పండి.
* మీకు తెలిసిన పండుగల పేర్లు చెప్పండి.
* మీకు ఏ పండుగ అంటే ఇష్టం? ఎందుకు?

పిల్లలూ! ఇట్లా చేయండి!

* పాఠంలోని బొమ్మలు చూడండి. ఆ బొమ్మల గురించి మాట్లాడండి.
* పాఠం చదువండి. అర్థం కాని పదాల కింద గీత గీయండి.
* గీత గీసిన పదాలకు అర్థాలను మీ మిత్రులను గాని, ఉపాధ్యాయులను గాని అడగండి లేదా **'పదాలు - అర్థాలు'** అనే పట్టికలో చూసి తెలుసుకోండి.

**పిల్లలకు దసరా సెలవులు ఇచ్చారు. బడి అంతా కోలాహలంగా ఉన్నది. ఇంతలో కవిత టీచర్ అక్కడికి వచ్చింది.**

పిల్లలు : నమస్కారం టీచర్!

టీచర్ : నమస్కారం పిల్లలూ! రేపటి నుండి దసరా సెలవులు కదా! ఎవరెవరు ఎక్కడెక్కడికి వెళుతున్నారు?

రమణ : సెలవుల్లో నేను మా అమ్మమ్మ వాళ్ల ఊరికి పోతా టీచర్!

దివ్య : మేము మా మామయ్య ఊరుకు పోతాం టీచర్! మేము దసరా పండుగ అక్కడనే జరుపుకుంటాం.

టీచర్ : కరుణా! నువ్వు ఎక్కడికి వెళుతున్నావు?

కరుణ : ఈ సెలవులకు ఎక్కడికీ వెళ్లం టీచర్! కానీ మేము క్రిస్మస్ పండుగకు మా అమ్మమ్మ వాళ్లింటికి పోతాం. క్రిస్మస్ పండుగ బాగా జరుపుకుంటాం.

టీచర్ : పిల్లలూ! చూశారా! మనకు ఎన్ని పండుగలు ఉన్నాయో?

పిల్లలు : పండుగల గురించి చెప్పండి టీచర్!

టీచర్ : చైత్రమాసంలో మొదటి తిథి పాడ్యమి కదా! ఆరోజు వచ్చే పండుగనే "ఉగాది" అంటారు.

స్వప్న : అంటే మన తెలుగు వాళ్లందరికీ నూతన సంవత్సరం, 'హ్యాపీ న్యూ ఇయర్' అన్నమాట.

టీచర్ : చాలా మంచిగ చెప్పావు స్వప్నా. ఆరోజే కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. కాబట్టి కొత్త బట్టలు ధరించడం, తీపి వంటకాలు చేసుకోవడం, షడ్రుచులతో పచ్చడిని చేసుకోవడం, రాబోయే ఏడాదంతా ఎట్లా ఉంటుందో తెలుసుకోవడానికి పంచాంగ శ్రవణం మొదలైనవి జరుపుకుంటాం. ఉగాది తరువాత తొమ్మిది రోజులకు, అంటే చైత్రమాస శుద్ధ నవమి రోజున "శ్రీరామనవమి"ని జరుపుకుంటాం. ఇది శ్రీరాముని జన్మదినం. ఈ రోజున సీతారాముల కల్యాణం చేసే సంప్రదాయం ఉన్నది.

దివ్య : టీచర్ ! దసరా పండుగ గురించి కూడా చెప్పండి.

టీచర్ : ఆశ్వయుజ మాసం శుద్ధ దశమి రోజున "దసరా" పండుగ జరుపుకుంటాం. రామయుడు, రావణాసురున్ని సంహరించింది ఈరోజే. మహాభారతంలో పాండవులు జమ్మిచెట్టు మీద దాచిపెట్టిన ఆయుధాలు తీసింది ఈరోజే. అందుకే ఈ రోజును "విజయదశమి"గా పిలుస్తాం. దసరా పండుగ నాడు పాలపిట్టను చూస్తాం. జమ్మిచెట్టుకు పూజ చేస్తాం.





తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

SCERT TELANGANA

దివ్య : బతుకమ్మ పండుగను కూడా అప్పుడే జరుపుకుంటారు కదా టీచర్!

టీచర్ : అవును, ఇదే సమయంలో "బతుకమ్మ పండుగ"ను కూడా ఎంతో సంబరంగ జరుపుకుంటాం. దసరా తరువాత 20 రోజులకు ఆశ్వయుజ బహుళ అమావాస్య రోజున "దీపావళి" పండుగ జరుపుకుంటాం. లోకాలను పట్టి పీడిస్తున్న నరకాసుర వధ జరిగిన సందర్భంగా ఈ పండుగ జరుపుకుంటారు. పటాకులు కాలుస్తారు. లక్ష్మీ పూజలు చేస్తారు.

తిరుమల : వినాయక చవితి కూడా చాల పెద్ద పండుగ కదా టీచర్!

టీచర్ : అవును తిరుమల! వినాయకుని పుట్టిన రోజును "వినాయకచవితి"గా, సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే రోజును "సంక్రాంతి"గా, శివలింగోద్భవం జరిగిన రోజును "శివరాత్రి" గా ఇట్లా ఎన్నో పండుగలు జరుపుకుంటాం. సరేగాని, రజియా! మీరు ఏమేం పండుగలు జరుపుకుంటారో చెప్పు.

రజియా : మేము రంజాన్, బక్రీద్, మొహర్రం మొదలగు పండుగలను చాలా గొప్పగా జరుపుకుంటాం టీచర్! అయితే "రంజాన్" అంటే నాకు చాలా ఇష్టం.

టీచర్ : "రంజాన్" అనేది ఇస్లాం క్యాలెండర్‌లో ఒక నెల పేరు. ఈ రంజాన్ నెలలోనే ముస్లింల పవిత్ర గ్రంథమైన దివ్య ఖురాన్ ఆవిర్భవించింది. అందుకే ముస్లింలందరూ ఈ నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షతో ఉండి, నెల చివర్న ఈద్ – ఉల్ – ఫితర్ (రంజాన్) పండుగను ఎంతో ఘనంగా జరుపుకుంటారు. ఇంకా, త్యాగానికి ప్రతీకగా నిలిచే 'బక్రీద్', 'మొహర్రం' పండుగలు కూడా పెద్ద ఎత్తున జరుపుకుంటారు.

కరుణ : టీచర్! మేము ప్రతి సంవత్సరం డిసెంబర్ 25న "క్రిస్మస్" పండుగను చాలా బాగా జరుపుకుంటాం. ఆ రోజు క్రిస్మస్ చెట్టుని రంగురంగుల నక్షత్రాలతో, బల్బులతో అలంకరిస్తాం. దానికి చిన్న చిన్న గంటలు కూడా కడతాం. కొత్త బట్టలు ధరించి, చర్చిలో ప్రార్థనలు చేస్తాం.





SCERT TELANGANA

టీచర్ : అవును.... ఏసుక్రీస్తు జన్మించిన రోజైన క్రిస్మస్ పండుగను క్రైస్తవులంతా ఎంతో విశేషంగా జరుపుకుంటారు. ఏసు జన్మించినప్పుడు ఆకాశంలో ఒక నక్షత్రం మెరిసింది. ఆ నక్షత్రాన్ని అనుసరించి వెళ్లిన ముగ్గురు జ్ఞానులకు బాల ఏసు కనిపించాడట. అందుకే క్రైస్తవులు ఆరోజు నక్షత్రాలతో ఇంటిని అలంకరించుకుంటారు.

లలిత : టీచర్! మా లంబాడి తండాలో మేము "తీజ్" పండుగను జరుపుకుంటాం.

టీచర్ : పిల్లలూ! లలిత చెప్పేది విన్నారా? గిరిజనులకూ కొన్ని ప్రత్యేకమైన పండుగలుంటాయి. అందులో లంబాడీలు జరుపుకునే తీజ్ పండుగ ఒకటి. ఇది కన్నె పిల్లలు జరుపుకునే పండుగ. ఒక రకంగా బొడ్డెమ్మ పండుగ వంటిది. తండాలోని ఆడ పిల్లలు సీత్లా భవాని (లంబాడీ దేవత)కి పూజ చేసిన తరువాత ఈ పండుగ జరుపుతారు. అడవిలో దొరికే దుసేరు తీగలతో అల్లిన బుట్టలో, తండా నాయకుని చేత పుట్టమన్ను పోయించి, వాటిలో నానబెట్టిన గోధుమలు చల్లుతారు. తొమ్మిదో రోజున ఆడపిల్లలు, ఆ మొలకెత్తిన నారును అన్నదమ్ములకు ఇచ్చి, ఆశీర్వాదం తీసుకుని నృత్యాలు చేస్తూ వెళ్లి ఆ బుట్టలను నిమజ్జనం చేస్తారు.

పిల్లలు : టీచర్! మాకు వివిధ మతాల వారు జరుపుకునే ముఖ్యమైన పండుగల గురించి ఎంతో బాగా చెప్పారు.

టీచర్ : పేరుకు వివిధ మతాల పండుగలైనా, అందరం కలిసి జరుపుకుంటాం. హిందువులు చేసుకున్న పిండి వంటలు ఇతర మతాల వారికి పంచడం, పీర్ల పండుగ (మొహర్రం) హిందువులు, ముస్లింలు కలిసి జరుపుకోవడం, వినాయక నిమజ్జనం రోజున ముస్లింలు చలివేంద్రాలు ఏర్పాటు చేసి జనానికి నీళ్లందించడం, ముస్లిం పండుగలప్పుడు హిందువులను, క్రిస్టియన్లను భోజనానికి పిలువడం, ఇట్లా కలిసి మెలిసి పండుగలు జరుపుకోవడం మన సంప్రదాయం. మన తెలంగాణ రాష్ట్రంలో హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు అందరూ కలిసి మెలిసి పండుగలను ఆనందంతో జరుపుకుంటారు.



ఇంతలో బడి గంట మోగింది. పిల్లలందరు టీచర్‌కు దసరా శుభాకాంక్షలు తెలిపి ఇంటి దారిపట్టారు.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22

## ఇవి చేయండి



### I. వినండి - ఆలోచించి చెప్పండి

(అ) ఉగాది పండుగను ఎట్లా జరుపుకుంటారో చెప్పండి.

(ఆ) మీ ప్రాంతంలో రంజాన్ పండుగను ఎట్లా జరుపుతారో చెప్పండి?

(ఇ) పండుగలు ఎందుకు జరుపుకుంటాం?



### II. ధారాళంగా చదువండి. అర్థం చేసుకొని చెప్పండి, రాయండి

**(అ) కింది పేరా చదువండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

బొడ్డెమ్మ ఆడపిల్లల పండుగ. కన్నెపిల్లలు, బాలికలు తమ పెండ్లి ఘనంగా, మంచిగా జరుగాలని ఎంతో సంబురంగ జరుపుకుంటారు. ఈ పండుగ భాద్రపద బహుళ అమావాస్యకు ముందు ప్రారంభమవుతుంది. 9 రోజులు ఆడి పాడి అమావాస్యకు ముందే బొడ్డెమ్మలను నిమజ్జనం చేస్తారు. పుట్టమన్నుతో గద్దెను చేసి, ముగ్గులు పెట్టి దానిలో "వెంపలి చెట్టు" ను పెడుతారు. అక్కడే గౌరమ్మను పెట్టి పూలతో అలంకరించి ఆడుకుంటారు. ఇది బంజారాల తీజ్ పండుగను పోలి ఉంటుంది.

**ప్రశ్నలు:**

1. బొడ్డెమ్మ ఎవరి పండుగ?

2. బొడ్డెమ్మ పండుగ ఎప్పుడు వస్తుంది?

3. బొడ్డెమ్మ గద్దెను ఎట్లా చేస్తారు?

4. బొడ్డెమ్మ పండుగను ఎట్లా జరుపుకుంటారు?

5. బొడ్డెమ్మ పండుగ దేనిని పోలి ఉంటుంది?

**(ఆ) పాఠం చదువండి. ఏ పండుగ ఏ మాసంలో వస్తుందో పట్టికలో రాయండి.**

| పండుగ పేరు | మాసం | పండుగ పేరు | మాసం |
|---|---|---|---|
| శ్రీరామనవమి | | ఉగాది | |
| దీపావళి | | రంజాన్ | |
| దసరా | | క్రిస్మస్ | |

SCERT TELANGANA



## III. ఆలోచించి సొంత మాటల్లో రాయండి. (స్వీయరచన)

(అ) పండుగ రోజులకు మిగతా రోజులకు ఉండే తేడా ఏమిటి?

(ఆ) నీకు ఇష్టమైన పండుగ ఏది? ఎందుకు?

(ఇ) తీజ్ పండుగ గురించి రాయండి.

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22



## IV. పదజాలం

(అ) కింది బొమ్మను చూడండి. లోపలి గుణింత అక్షరంతో బయటి అక్షరాలను కలిపి వీలైనన్ని పదాలు రాయండి.

బయటి అక్షరాలు: వ క గ చ జ ట త డ ద న ప బ మ య ర ల

లోపలి అక్షరాలు:
కో మా పు
కూ జా నా మో
య గా రి రై
చె తా వి సి
లు దీ

ఉదా : కోట

(ఆ) వర్షాకాలంలో వర్షాలు పడితే చెరువులు నీళ్ళతో కళకళలాడుతూ ఉంటాయి కదా! అట్లాగే ఏమేమి, ఎప్పుడెప్పుడు కళకళలాడుతూ ఉంటవో రాయండి.

| కళకళలాడేవి | ఎప్పుడెప్పుడు | వేటితో |
|---|---|---|
| ఉదా : చెరువులు | వర్షాలు కురిసినప్పుడు | నీళ్లతో |
| ఇల్లు | | |
| గుడి | | |
| బడి | | |
| ఆటస్థలం | | |
| తోట | | |
| ఊరు / వాడ | | |

SCERT TELANGANA

(ఇ) 'బతుకమ్మ' పూల పండుగ కదా! అట్లే కింది పండుగలు దేనికి సంబంధించినవో రాయండి.

సంక్రాంతి : ______________________

హోళి : ______________________

ఉగాది : ______________________

మొహర్రం : ______________________

రాఖీ పౌర్ణమి : ______________________

వినాయక చవితి: ______________________

దీపావళి : ______________________

క్రిస్మస్ : ______________________



## V. సృజనాత్మకత

**కింది గేయాన్ని పొడిగించండి.**

గణపతి పండుగ చందమామ
గొప్పగ జరుపుతం చందమామ
భాద్రపద మాసంలో చందమామ
చవితి తిథి రోజు చందమామ
మట్టి గణపతి చేసి చందమామ
______________________
______________________
______________________
______________________
______________________
______________________



SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22



## VI. భాషను గురించి తెలుసుకుందాం!

**(అ) కింది పదాలలో మహా ప్రాణాక్షరాలు గుర్తించి గీతగీయండి.**

| | | |
|---|---|---|
| 1) ఖగం | 2) ఘటం | 3) ఝషం |
| 4) కంఠం | 5) లాంఛనం | 6) ధృఢంగ |
| 7) అతిథి | 8) బోధ | 9) సఫలం |
| 10) భగభగ | 11) ఛవంతి | 12) ఖండం |



**(ఆ) కింద ఇచ్చిన అక్షరాలలో అల్ప ప్రాణాక్షరాలు గుర్తించి రాయండి.**

క ఖ గ ఘ ఙ

చ ఛ జ ఝ ఞ

ట ఠ డ ఢ ణ

త థ ద ధ న

ప ఫ బ భ మ

య ర ల వ శ ష స హ ళ క్ష ఱ

SCERT TELANGANA

## ప్రాజెక్టు పని



మీ బళ్ళో బతుకమ్మను పేర్చండి. బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మ పండుగ జరుపండి. బతుకమ్మను ఎట్లా జరుపుకున్నారో రాయండి.



## నేనివి చేయగలనా?

| | | |
|---|---|---|
| 1. | పండుగలు ఎందుకు జరుపుకుంటామో సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | పేరా చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలను. పట్టిక నింపగలను. | ఔను / కాదు |
| 3. | ఇష్టమైన పండుగ గురించి సొంత మాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | గేయాన్ని పొడిగించి రాయగలను. | ఔను / కాదు |



### సూక్తి

జనం సంఘటితమయ్యే కార్యమే మంచికార్యం. సామూహిక కార్యక్రమాల వల్లనే మనలో ఐక్యత ఏర్పడుతుంది.

– డా|| బి.ఆర్. అంబేద్కర్

SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ 2021-22